క్లుప్తంగా

పునరుత్పాదక వనరుల వినియోగం పెరగాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శాంతి హేమ్

నరసన్నపేట: పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని పునరుత్పాదక శక్తి వనరుల వినియోగం పెరగాలని ప్రభుత్వ డిగ్రీ/పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్ అన్నారు. జాతీయ ఇందన వనరుల పరిరక్షణ దివాస్ సందర్భంగా శనివారం కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేకమైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్.. మాట్లాడుతూ పునరుత్పాదక వనరులైన సోలార్, పవన, జల విద్యుత్, గోబర్ గ్యాస్ వంటి ఇందన వనరులను వినియోగించుకోవాలన్నారు. వీటి ద్వారా పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు గమనించాలని, వీటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు చైతన్యం తీసుకురావాలన్నారు. భౌతికశాస్త్ర అధ్యాపకుడు పి.ఢిల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యపై అవగాహన


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఆర్డ్స్ సంస్థ డైరెక్టర్ సన్యాసిరావు

బూర్జ: విద్యార్థులు ఆత్మ విశ్వాసం, నైపుణ్యాభివృద్ధి సాధిస్తే అన్ని రంగాల్లోనూ రాణిస్తారని పెద్దపేట ఆర్డ్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. మండలంలోని పెద్దపేట ఆర్డ్స్ సంస్థలో శనివారం జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులకు వృత్తి విద్యపై అవగాహన కల్పించారు. వృత్తి విద్యను అభ్యసించే విద్యార్థులు నైపుణ్యాల విషయంలో మరింత దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ పంటలు, చిరుధాన్యాలు, చిన్న తరహా పరిశ్రమలపైన అవగాహన కల్పించారు. నరసన్నపేట జీజేసీ ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, అధ్యాపకులు, పెద్దపేట ఆర్డ్స్ సంస్థ సీఈఓ నూక అనూప్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ పెన్షనర్స్ 'డే'ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సిమ్మినాయుడు, జనార్దనరావు

ఆమదాలవలస: జాతీయ పెన్షనర్స్ డేలో పెన్షనర్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సురవరపు సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు కోరారు. పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పెన్షనర్ల సంఘ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి జనార్దనరావు మాట్లాడుతూ.. ఈ నెల 17న జాతీయ పెన్షనర్స్ డేను పురస్కరించుకుని పెన్షనర్స్ అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటలకు వన్ వే జంక్షన్ వద్దనున్న గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తామన్నారు. మెయిన్ రోడ్డులో కొత్తకోట వారి వీధి మీదుగా ర్యాలీగా వెళ్లి ఐజీనాయుడు కాలనీలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘ కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు దాస్యం లక్ష్మణరావు, ఎస్.చంద్రశేఖరరావు, బి.సూర్యనారాయణ, కె.షణ్ముఖరావు, కార్యదర్శులు పి.వి.ఎస్.మాస్టారు, బెండి నారాయణరావు, పేడాడ ధనుంజయరావు, కర్నేన జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

కుప్పిలికి జాతీయ స్థాయి గుర్తింపు


కె.వి.రాజారావు

ఆమదాలవలస: పట్టణానికి చెందిన రచయిత కవి కుప్పిలి వెంకట రాజారావుకు నేషనల్ లెవెల్ పోయెట్రీ కాంటెస్ట్‌లో గుర్తింపు లభించింది. ఈ ఏడాది నవంబర్‌లో ఎస్- 7 పోయెట్రీ ఆర్గనైజేషన్ నిర్వహించిన ఆన్‌లైన్ ఇంగ్లిష్ పోయెట్రీ కాంటెస్ట్‌లో కె.వి.రాజారావు రచించిన డార్క్ సీన్ పోయెట్రీకి 139వ ర్యాంక్ వచ్చింది. దేశంలో వెయ్యి మందికి పైగా పాల్గొన్నారు. ఈ కాంటెస్ట్‌లో తాను కనబర్చిన సృజనాత్మకతను ప్రశంసిస్తూ ర్యాంక్ సర్టిఫికెట్‌ను గూగుల్ నిర్వాహకులు పంపినట్లు రాజారావు శనివారం తెలిపారు. ర్యాంకు రావడం పట్ల పట్టణంలోని సాహితీ అభిమానులు అభినందనలు తెలియజేశారు.

మార్మోగిన సాయి నామం

హిరమండలం: మండలంలోని పిండ్రువాడ కాలనీలో భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా సత్యసాయి నామంతో శనివారం మార్మోగింది. వేడుకల్లో భాగంగా కోటబొమ్మాళి సమితి ఆధ్వర్యంలో పల్లకి సేవ భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమంలో సాయి భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరం


సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న సవరమర్రిపాడు గిరిజనులు

- మెళియాపుట్టి మండల కేంద్రానికి కూతవేటు దూరంలో సవర మర్రిపాడు
- గిరిజనుల కష్టాలు పట్టించుకునేవారే కరువయ్యారు
- వేసవి రాకుండానే తాగునీటికి కటకట
- కనీస మౌలిక సదుపాయాల కరువు


పనిచేయని సోలార్ తాగునీటి పథకం

మెళియాపుట్టి: ఆ గిరిజన గ్రామం మండల కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఉంది. మర్రిపాడు 'సి' గ్రామ పంచాయతీ పరిధిలోని సవర మర్రిపాడు గిరిజన గ్రామంలో సుమారు 50 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. గ్రామానికి ఉన్న సీసీ రహదారి పాడైంది. గ్రామదేవత ఆలయానికి కనీసం రహదారి కూడా లేదు. శ్మశాన వాటికకు రహదారిలేక పొలాల మధ్యలో నుంచి వెళ్లాల్సిన పరిస్థితి. మురుగు కాలువలు సైతంలేక మురుగు నీటి నిల్వతో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా తాగునీరు కూడా లేక అనేక అవస్థలు పడుతున్నారు. ఒకే తాగునీటి పథకం పనిచేయడంతో అన్ని కుటుంబాలకు సరిపడా నీరు అందడంలేదు. ఒక్క పూటే నీరు ఇస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన సోలార్ మంచినీటి పథకం పనిచేయడంలేదు. గ్రామంలోని బోర్లు కూడా మరమ్మతులకు గురయ్యాయి. మండల పరిషత్ పాఠశాలలో 11 మంది పిల్లలే చదువుతున్నారు. వీరికి కనీసం తాగునీరు లేదు, మరుగుదొడ్లకు కూడా నీటి సౌకర్యం లేని దుస్థితి. బోర్ కూడా పనిచేయడంలేదు. పిల్లలు తాగడానికి పాఠశాలలో పనిచేసే ఆయా నీటిని తెస్తున్నారు. మధ్యాహ్న భోజనం వంట చేయడానికి కూడా నీటి సదుపాయంలేక ఎవరో ఒకరి ఇంటిలో వంటచేసి తీసుకువస్తున్నారు. గ్రామాన్ని సందర్శించి సమస్యలన్నీ పరిష్కారం చేయాలని గిరిజనులు కోరుతున్నారు. అధికారుల దృష్టిలో పెట్టామని, అయినా ఫలితంలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.


ఆలయానికి రహదారి లేదని చూపిస్తున్న గ్రామస్తులు


బోరుపని చేయడం లేదని చూపుతున్న మహిళ

శ్మశాన వాటికకు దారి లేదు



గ్రామానికి సుమారు అర కిలో మీటరు దూరంలో ఉన్న శ్మశాన వాటికకు రహదారి సౌకర్యం లేదు. ఎవరైనా మృతి చెందితే దహనపరిచే సమయంలో వెళ్లడానికి ఇబ్బంది పడతున్నాం. ఇదివరకే అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టిలో పెట్టాం. దయచేసి ఈ సమస్య పరిష్కరించండి.

– పెద్దింటి రాముడు, సవర మర్రిపాడు

తాగునీటికి ఇబ్బంది పడతున్నాం



ఊరంతటికీ ఒకటే వాటర్ ట్యాంక్ ఉంది (పనిచేసేది). ఉదయం మాత్రమే నీరు అందిస్తున్నారు. తాగడానికి అసలు నీరు సరిపోవడం లేదు. కుటుంబాలతో చాలా ఇబ్బంది పడుతున్నాం. తమ అవస్థలు తెలుసుకుని మాకు తాగునీటి సౌకర్యం కల్పించండి. వేసవిలో ఇలాంటి సమస్యవస్తే తాగునీటికోసం ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి ఉంది. మా బాధను అర్థం చేసుకుని పరిష్కరించండి.

– సవర పుణ్యవతి, సవర మర్రిపాడు

సమస్యలు పరిష్కరిస్తాం

నేను గ్రామ పంచాయతీకి కొత్తగా వచ్చాను. సమస్యలన్నీ మా దృష్టిలో ఉన్నాయి. ఇటీవల గ్రామ సర్పంచ్‌తో సంప్రదించాను. త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తాను. తాగునీటి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటాం.

– ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి

ధనుర్మాస ఉత్సవాలకు ఏర్పాట్లు


సరుబుజ్జిలి: రంగనాథస్వామిని అలంకరిస్తున్న అర్చకుడు


నరసన్నపేట: గీతా మందిరంలో ఉత్సవ విగ్రహాలు

సరుబుజ్జిలి: ధనుర్మాస ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని పురుషోత్తపురం భూనీలాగోదారంగనాథ స్వామి ఆలయ అర్చకుడు సనపల యతిరాజు దాసు శనివారం ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 16 సోమవారం తెల్లవారు జామున 5 గంటలకు అన్ని పూజా కార్యక్రమాలు పూర్తిచేసుకొని ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభించనున్నామని వెల్లడించారు. దీనినే నెలగంటు అనికూడా పిలుస్తారని తెలిపారు. ఈ ఉత్సవాలు జనవరి 13న గోదాకల్యాణంతో ముగిస్తామని వెల్లడించారు. తిరుప్పావై, శాంతమలై, మంగళాశాసనాలు 30 రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు తప్పకుండా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని అర్చకులు కోరారు.

16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

నరసన్నపేట: స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు గీతా మందిరంలో ధనుర్మాస ఉత్సవాలు ఈ నెల 16 నుంచి నిర్వహించనున్నట్లు అర్చకులు కృష్ణమాచార్యులు, సూరిబాబు శనివారం తెలిపారు. వెంకటేశ్వర ఆలయంలో ప్రతి రోజూ అమ్మవారి గోత్రాలతో అర్చనలు నిర్వహిస్తామని, 10న ముక్కోటి ఏకాదశి పర్వదినం ఉంటుందని కృష్ణమాచార్యులు తెలిపారు. గీతా మందిరంలో 16 నుంచి రోజూ వివిధ పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సూరిబాబు తెలిపారు. 22న పుష్పాంజలి, 31న ఊంజల్ సేవ, జనవరి 3న దీపోత్సవం, 8న హారతి 10న మక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, 11న కుడార్తై ఉత్సవం 13న గోదా రంగనాథుల కల్యాణం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలన్నారు.

16 నుంచి ధనుర్మాస వ్రతాలు

పాతపట్నం: ఈ నెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస వ్రతాలు నిర్వహించనున్నట్లు వేంకటేశ్వర ఆలయం అర్చకులు శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఆలయంలో రోజూ ఉదయం 5 గంటలకే అభిషేకాలు, ధనుర్మాస పూజలు, తిరుప్పావై, లక్ష్మీ అష్టోత్తరం, విష్ణుసహస్రనామ పారాయణం, గోదాదేవి అష్టోత్తర సహిత తిరుప్పావై పారాయణం, తిరుప్పల్లాండ్ పఠనం జరుగుతాయన్నారు. జనవరి 13న గోదాదేవిరంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి కార్యదర్శులకు శిక్షణ

పాతపట్నం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో ఈ నెల 16వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.చంద్రకుమారి శనివారం తెలిపారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీల్లో రెండు బ్యాచ్‌లు ఏర్పాటు చేసి ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. సుస్థిర పాలన, అభివృద్ధి లక్ష్యాలపై పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు, సచివాల ఉద్యోగులకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ తరగుతులకు తప్పకుండా హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

ఇది కూడా రహదారేనా?



మెళియాపుట్టి మండలంలోని గొడ్డ గ్రామం నుంచి ఆంపురం వెళ్లే రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. సుమారు 7 కిలోమీటర్ల మేర రింపి, పెంగువాడ, బంజీరు పలు గిరిజన గ్రామాల మీదుగా పాతపట్నం మండలంలోకి ఈ రహదారి గుండా వెళ్లవచ్చు. ఈ రహదారి ప్రస్తుతం అస్తవ్యస్తంగా తయారైంది. కనీసం కంకర రహదారి కూడా కరువై మట్టి దారిలో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రహదారిలోని మట్టి ఊడిపోయి మధ్య, మధ్యల్లో కాలువల చందంగా తయారైంది. అత్యవసర వేళల్లో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడితే పూర్తిగా ఆ రహదారిలో ప్రయాణించడం కష్టతరమే.. దీనిపై నాయకులు, అధికారులు దృష్టి సారించాలని ఆయా గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- మెళియాపుట్టి

ఆక్రమించేయ్.. షాపులు పెట్టేయ్..



నరసన్నపేట పట్టణంలో ఎక్కడక్కడ ప్రభుత్వ స్థలాల్లో షాపులు వెలుస్తున్నాయి. తాజాగా పెద్దపేట కూడలి వద్ద పాత జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న టీ స్టాల్ స్థానంలో పక్కనే ఓ షాపును ఏర్పాటు చేస్తున్నారు. పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీలో పనిచేస్తున్న కొందరు శానిటేషన్ మేస్త్రీలు, సిబ్బంది చేతివాటం చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇక్కడ రెండు షాపులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మూడోది ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. దీనిని పంచాయతీ ఈఓ ద్రాక్షాయిని దృష్టికి తీసుకువెళ్లగా.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

- నరసన్నపేట

ఇరుకైన బ్రిడ్జితో ఇబ్బందులు



సరుబుజ్జిలి మండలంలోని చిగురువలస గ్రామానికి వెళ్లే రహదారిలో హైలెవెల్ కాలువపై నిర్మించిన బ్రిడ్జి వలన నరకయాతన తప్పడంలేదు. బ్రిడ్జి పైభాగం ఒకే లెవల్‌లో నిర్మించడం వలన ఏమాత్రం వర్షం వచ్చినా నీరు నిల్వ అవుతుంది. వర్షం ధాటికి బ్రిడ్జి చుట్టూ ఉన్న మట్టి కూడా పైభాగానికి చేరుకొంటుంది. పనులు చేసే సమయంలో మట్టిని సర్దుబాటు చేయకపోవడం వలన నీరు ఎటూ వెళ్లడానికి అవకాశం లేదు. బ్రిడ్జి కూడా ఇరుకుగా నిర్మించడం వలన ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమయంలో ప్రమాదాలు జరగుతున్నాయి. బ్రిడ్జిపై నుంచి పాదాచారులతోపాటు వాహనదారులు రాకపోకలు చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు.

- సరుబుజ్జిలి

మూలకుచేరిన ఇన్సినేటర్



సారవకోట మండలంలోని వాండ్రాయి సచివాలయానికి గతంలో అందించిన ఇన్సినేటర్ మూలకుచేరింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో దీనిని వినియోగించాలి. బాలికల నెలసరిలో వినియోగించే ప్యాడ్స్‌ను కాల్చిందేకు ఈ యంత్రం అందించారు. ప్రస్తుతం ఈ యంత్రం ఆరుబయట నిరుపయోగంగా పడింది.

- సారవకోట

ఘనంగా సెమీ క్రిస్మస్


సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు, కుటుంబ సభ్యులు

ఆమదాలవలస: మండలంలోని గాజులకొల్లివలస సమీపంలో గల బేతేలు స్వస్థత ప్రార్థన గృహంలో శనివారం మున్సిపాలిటీ, మండల పాస్టర్ల ఫ్యామిలీ ఐక్య క్రిస్మస్‌ను క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు రాడ విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. బీమపాలక మాట్లాడుతూ సర్వ మానవాళికి శాంతి, ప్రేమ, కరుణకు చిహ్నం క్రిస్మస్ అని గుర్తుచేశారు. కేకు కట్ చేశారు.

ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌ను సత్కరించారు. ఫాస్టర్లు శామ్యూల్ అరుణ్ కుమార్, అసిర్ కుమార్‌ద్ జార్జ్ ముల్లర్, నియోజకవర్గ పెద్దలు శ్యామ్, అహరోన్ రాజ్, సంసోన్, స్టీవెన్, క్రిస్టఫర్, రవీంద్రబాబు, సింహాద్రి తదతరులు పాల్గొన్నారు.

30 మద్యం బాటిళ్ల స్వాధీనం

పాతపట్నం: మండలంలోని కొరసవాడ బస్టాండ్ వద్ద 30 మద్యం బ్యాటిళ్లను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. కాగువాడకు చెందిన మహిళ వీటిని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

రెండు చోట్ల ఎన్నిక వాయిదా

నరసన్నపేట: మండలంలో కోమర్తి, ఉర్లాం నీటి సంఘాల పరిధిలోని పోతయ్యవలస, కంబకాయ గ్రామాలకు సబంధించిన ఒక్కో టీసీ ఎన్నిక వాయిదాపడ్డాయి. మొత్తం మండలంలో ఆరు సాగు నీటి సంఘాలు ఉండగా.. 72 టీసీలకు ఎన్నికలకు నిర్వహించారు. 69 టీసీలకు ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. కంబకాయలో రెండు టీసీలు ఉండగా ఒక టీసీకి ఎన్నిక నిర్వహించారు. ఎన్నికలను తహసీల్దార్ సత్యనారాయణ, సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ సమీక్షించారు.

సత్రాం నీటి సంఘం అధ్యక్షుడిగా సింహాచలం

సారవకోట: మండలంలోని సత్రాం ఊర చెరువు నీటి సంఘం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా గొండు సింహాచలం, ఉపాధ్యక్షుడిగా కొల్లి ఈశ్వరరావు ఎన్నికైయ్యారు. మండలంలో వంశధార నీటి వినియోగదారుల సంఘాల్లో ఇది ఒక్కటే పెద్దది కాగా.. మిగిలిన 11 చిన్న నీటి సంఘాలకు ఈ ఎన్నికలు నిర్వహించారు. తొగిరి నీటి సంఘం ఎన్నికలో ఇరువర్గాల మధ్య చిన్నపాటి ఘర్షణ వాతావరణం నెలకొంది. తండ్యాల సింహాచలం ఈ ఎన్నికను బహిష్కరించారు. దీనిపై న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తానని తెలిపారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అభినందలు తెలిపారు.


సారవకోట: సింహాచలంకు డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న అధికారులు

గంగువాడలో గందరగోళం..

పాతపట్నం: మండలంలోని గంగువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గంగువాడ-1, 2 సంఘాలకు జరిగిన సాగునీటి ఎన్నికల్లో ఓట్లు కలిగిన రైతులతో పడాల రంజీత్, శ్రీనువాసరావు పోలింగ్ బూత్ వద్దకు ఉదయం 8 గంటలకు చేరుకున్నారు. మరో వర్గానికి చెందినవారు వాదను దిగడంతో కొంతసమయం గందరగోళం ఏర్పడింది. పోలీసులు చేరుకుని రైతులను పాఠశాల నుంచి బయటకు పంపించారు. దీంతో రెండు సాగునీటి సంఘాలను ఏకగ్రీవమయ్యాయి. మండలంలోని 18 సాగునీటి సంఘాలు ఏకగ్రీవమయ్యాయని తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు.

నీటి సంఘాల ఎన్నిక తీరు బాగులేదు


ఎంపీపీ వాన గోపి

జలుమూరు: అడ్డగోలు నిబంధనలు పెట్టి నీటి సంఘాల ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించిన తీరు బాగులేదని, అందుకే వైఎస్సార్‌సీపీ ఎన్నికలకు దూరంగా ఉందని ఎంపీపీ వాన గోపి అన్నారు. శనివారం జలుమూరులో విలేకర్లతో మాట్లాడారు. నీటి సంఘాల ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించలేదన్నారు. అంతా తామై టీడీపీ నాయకులు వ్యవహరించారన్నారు.

సీఆర్పీఎఫ్‌కు ఇద్దరు ఎంపిక


ఎం.సాయిరాజ్


ఎం.రవితేజ

పొందూరు: కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి విడుదల చేసిన ఫలితాలలో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ పోస్టులకు మండలంలోని బురిడికంచారం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఎం.సాయిరాజ్, ఎం.రవితేజ కానిస్టేబుల్స్‌గా సెలెక్ట్ అయ్యారు. సాయిరాజ్ తండ్రి రమణ ఆటో డ్రైవర్, తల్లి మాణిక్యం గృహిణి. రవితేజ్ తండ్రి పండ్ల వ్యాపారి, తల్లి ఇందిర గృహిణి. వీరికి తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది..


తలకొరివి పెడుతున్న లక్ష్మి

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం కాపు వీధికి చెందిన దొంపాక వరహాలమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు పిల్లలు లేరు. ఇతర కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడంతో తమ్ముడు భార్య లక్ష్మి తలకొరివి పెట్టింది. వృధ్యాప్యంలో ఉన్న వరహాలమ్మకు అన్నీ తానై లక్ష్మి సేవ చేసింది. తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. వరహాలమ్మ తమ్ముడు కూడా గతంలోనే మరణించాడు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



నరసన్నపేట:లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి హరిప్రియ

నరసన్నపేట: స్థానిక కోర్టులో సివిల్ జడ్జి సిహెచ్ హరిప్రియ అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. ఎక్సైజ్ కేసులు 85తోపాటు మొత్తం 207 కేసులు పరిష్కారమయ్యాయి. జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ఏపీపీ ఆర్.సంతోషి, ఎక్సైజ్ పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

320 కేసులు పరిష్కారం

ఆమదాలవలస: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జడ్జి ఎస్.మణి ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించారు. సివిల్, క్రిమినల్, మనోవర్తి, పీఎల్‌సీ తదితర 320 కేసులు పరిష్కరించారు. వీటికి సంబంధించి రూ.1.41,440 అపరాధ రుసం వసూలు చేశారు. తొలిత కోర్టు ఆవరణలో కక్షిదారులకు చట్టాలపై అవగాహన కల్పించారు. రాజీయే రాజమార్గమని సూచించారు. ఏపీపీ నాగభూషణరావు, లోక్‌అదాలత్ మెంబర్లు ఎస్.ధనుంజయరావు, కె.త్రినాథరావు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

166 కేసులు పరిష్కారం

పాతపట్నం: స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించి 166 కేసులను పరిష్కరించినట్లు నరసన్నపేట కోర్టు జూనియర్ సివిల్‌జడ్జి సి.హెచ్.హరిప్రియ తెలి పారు. ఎక్సైజ్ కేసులు 98, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 48, క్రిమినల్ కేసులు 17, రాజీపడదగిన క్రిమినల్ కేసులు (భూమి) 3 పరిష్కరించామన్నారు.

